


కృష్ణా జలాలను ఎస్కేప్ ఛానల్‌కు మళ్లించడం

రాయలసీమకు అన్యాయం



నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు కృష్ణాజలాలు అందకుండా శాశ్వతంగా అడ్డుకట్ట వేసి నీటిని ఎస్కేప్ ఛానల్‌కు మళ్లించడం రాయలసీమకు అన్యాయమేనని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణాజలాల వినియోగంపై ప్రభుత్వం జారీచేసిన జీవోలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన 120 టీఎంసీల నీటిని శ్రీశైలం జలాశయం నుంచి 30 రోజుల్లో అందించాలన్న లక్ష్యంతో అనేక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్సార్బీసీ రెగ్యులేటర్ ద్వారా ప్రధాన కాల్వకు కృష్ణా జలాలు వెళ్లకుండా శాశ్వతంగా అడ్డుకట్ట వేసి ఆ నీటిని ఎస్కేప్ ఛానల్‌కు మళ్లించే నిర్మాణాలను పూర్తిచేశారని, ఈ పనులకు పాలనాపరమైన అనుమతులు ఎవరు, ఎప్పుడు ఇచ్చారో తక్షణమే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ ద్వారా కృష్ణా జలాలు గోరుకల్లు రిజర్వాయర్‌కు చేరడానికి ఉన్న అడ్డంకులను తొలగించి 22వేల క్యూసెక్కుల సామర్థ్యానికి తక్షణమే పెంచాలని కోరారు.

పెండేకంటి గణేశుడి లడ్డూ రూ.6.10లక్షలు

- వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టర్



లడ్డూ ప్రసాదాన్ని గాలి సుదర్శన్‌రెడ్డికి అందిస్తున్న పారిశ్రామికవేత్త దొనపాటి యాగంటిరెడ్డి తదితరులు

బనగానపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు అంటే కోలాహలం, సంబరాలే కాదు.. ముఖ్యంగా లడ్డూ వేలం కూడా. గణేష్ మండపాల్లో స్వామివారి చెంత ఉంచిన లడ్డు ప్రసాదాన్ని వేలంలో దక్కించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలోనే బనగానపల్లె పట్టణంలోని పెండేకంటినగర్‌లో గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని బుధవారం రాత్రి వేలం నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలం పాటలో కాంట్రాక్టర్ గాలి సుదర్శన్ రెడ్డి రూ.6.10 లక్షలు దక్కించుకున్నారు. గతేడాది కూడా గాలి సుదర్శన్‌రెడ్డి గణేశుని లడ్డూ ప్రసాదాన్ని రూ.3.10లక్షలకు పాడి దక్కించుకున్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.. అన్నదాత సాగుకు సిద్ధమయ్యాడు.. ఇలాంటి తరుణంలో రైతులకు యూరియా ఎంతో అవసరం. మే, జూన్ పంటలు వేయకముందే జిల్లాలో యూరియా మాయమైనట్లు నిదర్శనాలు స్పష్టంగా కనపడుతున్నాయి. మే చివరి వారం నాటికే 2825.415 మెట్రిక్ టన్నుల యూరియా డీసీఎంఎస్‌లకు, పీఏసీఎస్‌లకు తరలించారు. జూలై చివరి నాటికి 18,240 మెట్రిక్ టన్నుల యూరియాను విక్రయించగా, హోల్‌సేల్, రీటైల్ డీలర్ల వద్ద 12,241 మెట్రిక్ టన్నులు నిల్వలున్నాయి. అప్పటికి పంటలు వేసింది కేవలం వరి 30శాతమే. మిగిలిన యూరియా ఎక్కడికి వెళ్లిందో నేటికీ అంతుచిక్కని ప్రశ్నే.



యూరియాను పరిశీలిస్తున్న అధికారులు

యూరియా.. హాంఫట్

- మాయమైపోయిన యూరియా లారీ
- ఇతర రాష్ట్రాలకు తరలిపోతుందా..?
- పరిశ్రమలకు చేరుతుందా?
- అస్తవ్యస్తంగా యూరియా పంపిణీ
- తూతూమంత్రంగా విజిలెన్స్ దాడులు
- కలెక్టర్ సీరియస్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటలు వేయకముందే యూరియా గోదాములకు చేరుకోవడంతో అదే అదనుగా భావించిన కొందరు అధికారులు, పలువురు డీలర్ల వ్యూహం ఫలించిందనే చెప్పవచ్చు. మే, జూన్ పంటలు వేయకముందే జిల్లాలో యూరియా మాయమైనట్లు నిదర్శనాలు స్పష్టంగా కనపడుతున్నాయి. మే చివరి వారం నాటికే 2825.415 మెట్రిక్ టన్నుల యూరియా డీసీఎంఎస్‌లకు, పీఏసీఎస్‌లకు తరలించారు. జూలై 16 నాటికి 18,240 మెట్రిక్ టన్నుల యూరియాను విక్రయించగా, హోల్‌సేల్, రీటైల్ డీలర్ల వద్ద 12,241 మెట్రిక్ టన్నులు నిల్వలున్నాయి. అప్పటికి పంటలు వేసింది కేవలం వరి 30శాతం, మొక్కజొన్న 50శాతం, కందులు 50శాతం, పత్తి 15శాతం మాత్రమే పంటలు వేశారు. పంటలకు సరిపడేకంటే యూరియా అధికంగా అమ్మేశారు. ఆ యూరియా ఎక్కడికెళ్లిందో తెలియని పరిస్థితి. కలెక్టర్ రాజకుమారి సైతం వ్యవసాయాధికారుల సమావేశంలో యూరియాపై పలు సందేహాలను వ్యక్తం చేయడం గమనార్హం. అధికారులు మాత్రం రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి నిల్వలు పెట్టుకున్నారంటూ దాటవేస్తున్నారు.

విక్రయాలు చూస్తే అవాక్కు అవాల్సిందే..

జూలై 22వ తేదీ నాటికి మండలాల్లో పంటలు వివరాలు, ఆగస్టు 4వ తేదీ నాటికి ఆయా మండలాలకు యూరియా విక్రయాలు చూస్తే అవాక్కు అవాల్సిందే.. ఆళ్లగడ్డ మండలంలో 2482 హెక్టార్లలో పంటలు వేయగా 555.48 మెట్రిక్ టన్నులు మాత్రమే అందజేశారు. ఆత్మకూరు మండలంలో 4353 హెక్టార్లలో పంటలు వేయగా అక్కడికి మాత్రం 1953.465 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశారు. మెట్ట పొలాలు ఎక్కువగా ఉండే బనగానపల్లె మండలంలో 537 హెక్టార్లు మాత్రమే పంటలు వేయగా అక్కడికి మాత్రం 2482.78 మెట్రిక్ టన్నుల యూరియాను తరలించారు. డోన్ మండలంలో 18262 హెక్టార్లలో పంటలు వేయగా అక్కడికి మాత్రం కేవలం 187.06 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. బేతంచెర్ల మండలంలో 4594 హెక్టార్‌లలో పంటలు వేయగా 103.95 మెట్రిక్ టన్నులు విక్రయించారు. నంద్యాల మండలంలో 1056 హెక్టార్లలో పంటలు వేయగా 3,652.99 మెట్రిక్ టన్నులు యూరియా విక్రయించారు. ఇలా ప్రతి మండలంలో పంటల వారీగా కాకుండా ఇష్టానుసారంగా జరిగిన కేటాయింపులతో పలు మండలాల రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారు.



ఎంత వరకు సబబు..

ఎరువుల షాపులను నిత్యం పర్యవేక్షించే అధికారులనే మళ్లీ వ్యవసాయ విజిలెన్స్ అధికారులుగా నియమించడంతో వారు అనుకున్న పని మరింత సులువుగా మారింది. డివిజన్‌లో పనిచేస్తున్న అధికారులను మళ్లీ అదే డివిజన్‌లోనే తనిఖీ అధికారులుగా నియమించడం ఎంతవరకు సబబు అని కొందరు తప్పుబడుతున్నారు.



పసురపాడు రైతు సేవా కేంద్రం

మార్గమధ్యలోనే మాయం

మార్క్‌ఫెడ్ నుంచి గోస్పాడు మండలం పసురపాడు గ్రామానికి చేరుకోవాల్సిన యూరియా లారీ మార్గమధ్యలోనే మాయమైంది. రైతు సేవా కేంద్రం నుంచి 19వ తేదీకి చేరుకోవాల్సిన యూరియా లారీ నేటి వరకు ఆచూకీ లేదు. దీనిపై నేటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా గమ్యస్థానాలకు చేరకుండా ఎన్ని లారీలు సరిహద్దులు దాటాయో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులు ఫిర్యాదు చేసే వరకు అధికారులకు తెలియడం లేదు. పసురపాడు సంఘటనపై ఆ మండల వ్యవసాయాధికారిణి స్వప్నికను వివరణ కోరగా ఆ ఘటనపై తమకు ఆలస్యంగా సమాచారం అందిందని, లారీ యూరియా ఆర్ఎస్‌కే చేరినది వాస్తవమేనని చెప్పారు. ఆర్ఎస్‌కేలో పనిచేస్తున్న హార్టికల్చర్ అసిస్టెంట్‌ను విచారిస్తున్నామని, ఇప్పటికే ఈ విషయంపై జిల్లా వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

రైతులకు ఇచ్చే యూరియాను దారిమళ్లించి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ రాజకుమారి వ్యవసాయాధికారులతో అన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయాధికారులతో నిర్వహించిన ఓ సమావేశంలో అధికారులతో ఘాటుగానే మాట్లాడారు. నిఘా పెంచి బాధ్యులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇచ్చే యూరియాను ఇతర అవసరాలకు ఉపయోగించడం మంచిది కాదన్నారు. మండల స్థాయిలో ఒక టీమ్‌ను ఏర్పాటుచేసి రెండు రోజుల్లో తమకు నివేదిక అందజేయాలని అధికారులకు సూచించారు.

నిలిచిన రాకపోకలు

- మళ్లీ ఉగ్రరూపం దాల్చిన భవనాశి నది
- ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు
- వరదరాజస్వామి ప్రాజెక్ట్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



ఆత్మకూరు శివారులో ఉప్పొంగి ప్రవహిస్తున్న భవనాశి నది

ఆత్మకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా ఆత్మకూరు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో పట్టణ శివార్లలోని భవనాశి నది మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి 26.8మిమీ వర్షాపాతం నమోదవ్వడంతో వాగులు, వంకలు ఏకమై భవనాశితో కలిసి ప్రవహించింది. దీనికితోడు వరదరాజ స్వామి ప్రాజెక్ట్ పరిధిలోని నల్లమల క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి గరిష్ఠ స్థాయిలో నీరు చేరడంతో దిగువ మునిమడుగుల వాగుకు నీటివిడుదల జరగడంతో భవనాశిలో వరద ప్రవాహం మరింత ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఆత్మకూరు పట్టణం నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. అదేక్రమంలో భవనాశి పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు, ఇటుకల బట్టీలు కూడా నీటమునిగాయి. అలాగే భవనాశి సమీపంలోనే ఉన్న పడేవాగులో కూడా నీటి ప్రవాహం కొనసాగింది. అలాగే వడ్లరామాపురానికి వెళ్లే రహదారిపై ఉండే పీతురువాగు కూడా ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము భవనాశి నది ఉధృతిని పరిశీలించి అటువైపు ప్రజలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

వీఆర్ఎస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నల్లమలలో కురిసిన భారీ వర్షంతో ఆత్మకూరు మండలంలోని వరదరాజ స్వామి ప్రాజెక్ట్ (వీఆర్ఎస్పీ)లోకి భారీగా వర్షపునీరు చేరింది. ప్రాజెక్ట్ గరిష్ఠ నీటిమట్టం 370 మీటర్లకు గానూ ప్రస్తుతం 369.5 అడుగుల మేర నీటినిల్వలు ఉన్నాయి. అదేక్రమంలో ప్రాజెక్ట్‌లో గరిష్ఠ స్థాయిలో 0.38 టీఎంసీల నీటి ఉండటంతో మునిమడుగుల వాగుకు నీటి విడుదల చేస్తున్నారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం పెరగడం వల్ల రెండు క్రస్టుగేట్ల ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నీటి విడుదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

గణనాథుడికి గొడుగు!




వినాయక చవితి వేడుకలకు ఈ ఏడాది వరుణదేవుడి ఎఫెక్ట్ పడింది. వెలుగోడు మండలంలో వినాయకచవితి పురస్కరించుకొని పోటాపోటీగా నిర్వాహకులు భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. బుధ, గురువారాల్లో వర్షాలు రావడంతో వెలుగోడు సూపర్ కే సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడు తడవకుండా నిర్వాహకులు ఇలా గొడుగును ఏర్పాటు చేశారు.

– వెలుగోడు (ఆంధ్రజ్యోతి)

జైజై గణేశా..!

- ఘనంగా ఆరంభమైన గణేశ్ నవరాత్రి వేడుకలు
- వాడవాడలా కొలువుదీరిన గణపయ్యలు



నంద్యాల పట్టణంలోని చిత్తారి వీధిలో ప్రత్యేక ఆకర్షణలో వజ్రాల గణపతి

వివరాలు 6లో

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

7





రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితి

ఒకటిన్నర ఎకరాలో ఉల్లి పంటను రూ.లక్ష ఖర్చుతో సాగు చేశాను. అయితే.. కర్నూలు యార్డులో పరిస్థితిని చూస్తే క్వింటానికి గరిష్ఠ ధర రూ.వెయ్యి కూడా అందే అవకాశం లేదు. గత సంవత్సరం ఇదే సమయానికి కర్నూలు యార్డులో క్వింటా ఉల్లి రూ.4వేలకు అమ్మాను. రూ.3 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి క్వింటా రూ.వెయ్యి కూడా వచ్చే పరిస్థితి లేదు. లారీ ఖర్చు కూడా అందుతుందో లేదో.

– చంద్రయ్య, పెనుమాడ, క్రిష్ణగిరి మండలం




స్లాట్ ఫారాలన్నీ నిండిపోయిన ఉల్లి నిల్వలు

మళ్లీ ఉల్లి పతనం

- తీవ్ర సంక్షోభంలో ఉల్లి రైతాంగం
- ప్రస్తుత ఖరీఫ్‌లో 50వేల ఎకరాల్లో సాగు
- వెంటాడుతున్న వర్షం.. పొలాల్లోనే కుళ్లిపోతున్న పంట
- యార్డుల్లో అన్నదాతల జాగరణ

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వర్షాలు ముందుగానే పడటంతో రైతులు మే నెల నుంచే ఉల్లి సాగును ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో 50వేల ఎకరాల దాకా ఈసారి ఉల్లి పంట సాగు చేశారు. ఓ వైపు వర్షాలు, ఇంకో వైపు ధర పతనం కావడంతో రైతులు మార్కెట్ యార్డులో కన్నీరు మున్నీరవుతున్నారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డుకు 8వేల క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. గత నాలుగు రోజుల నుంచి కూడా ఉల్లి అమ్మకాలు లేక కొంత మంది రైతులు యార్డులోనే జాగరణ చేస్తున్నారు. ఉల్లిగడ్డలు తేమ పట్టి ఉండటం తో ఎక్కువ ధరను చెల్లించేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. నాలుగు రోజులుగా పరిశీలిస్తే క్వింటా ఉల్లి ధర గరిష్ఠంగా రూ.వెయ్యి, కనిష్ఠ ధర రూ.500కు మాత్రమే అమ్ముడుపోతుంది. దీంతో కనీసం రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి. కొంత మంది రైతులు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లి ఇబ్బందులు పడుతుంటే.. మరికొందరు రైతులు పొలంలోనే ఉల్లిని పశువులకు మేతగా వదిలేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి ధర క్వింటా రూ.4వేలకు పైగా పలికింది. కానీ ఇప్పుడు మాత్రం రూ.వెయ్యికి కూడా కొనేవారు కరువయ్యారు. అమ్మకానికి ఉల్లి దిగుబడులు అధికంగా రావడంతో పాటు వరుస వర్షాలతో రైతులను మరింత కుదిపేస్తున్నాయి. చేతికొచ్చిన ఉల్లి పొలాల్లోనే కుళ్లిపోతుండటంతో ఆ రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురు కావడంతో వారు మంత్రులకు నివేదించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబునాయుడును కలిసి ఉల్లి రైతుల దయనీయ స్థితిని తెలియజేశారు. దీంతో సీఎం చంద్రబాబు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీతను పిలిపించి ఉమ్మడి జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం డైరెక్టర్ ఆదేశాలపై మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, కడప నుంచి కర్నూలు యార్డుకు వచ్చి రైతుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు సూపర్‌వైజర్లతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందజేస్తామని, రైతులను ఆదుకుంటామని జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ప్రకటించారు.




ఉల్లిని ఎవరూ కొనకపోవడంతో కర్నూలు యార్డులో నాలుగు రోజులుగా జాగరణ చేస్తున్న రైతు శ్రీనివాసులు

మిగతా 7వ పేజీలో

వాడుక భాషకు గిడుగు తొలి అడుగు..!

● నేడు తెలుగు భాషా దినోత్సవం ● గిడుగు రామమూర్తి పంతులు జయంతి



కర్నూలు కల్చరల్/ఆత్మకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు భాషకు పునాది వేసిన మహనీయుడు, కవి, గొప్ప సంఘ సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి. ఆయన జయంతిని పురస్కరించుకొని గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లాలోని వివిధ సాహితీ, కళా సంస్థలు ఘనంగా నిర్వహించుకోనున్నాయి. ఈ సందర్భంగా తెలుగు భాషకు పట్టం కడుతూ విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష ప్రాముఖ్యత, సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేసేదే తెలుగు భాషా దినోత్సవం. అలాగే తెలుగును అధికారిక భాషగా, విద్యాబోధనలో వాడకాన్ని పెంచడానికి కృషి చేసే రోజే ఇది. జిల్లాలోనూ సాహిత్యం, కళారంగాల్లో తెలుగు భాషను సుసంపన్నం చేస్తూ ఎందరో కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులు, రంగస్థల కళాకారులు, గాయకులు రాణిస్తున్నారు. తెలుగు భాషకు పెద్దపీట వేస్తూ తేనెలొలికే తెలుగు కమ్మదనాన్ని పదుగురికి పంచిపెడుతున్నారు. కథ, కథానిక, కవిత్వం, నాటకం, నవల, బాలసాహిత్యం తదితర అంశాల్లో తమదైన గుర్తింపుతో ముందుకు సాగుతున్నారు. తెలుగు భాషా దినోత్సవానికి ఆద్యుడు, వాడుక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామమూర్తి బాటలో కొనసాగుతున్నామని చెబుతున్న వీరు తెలుగు భాష దినోత్సవం ఒక్కరోజు నిర్వహించుకునే ఒక వేడుక మాత్రమే కాదని, ఇది భాషాభివృద్ధికి, తెలుగు సంస్కృతి పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని స్ఫూర్తినిచ్చే రోజుని వారు అంటున్నారు.



బాల్యం నుంచీ తెలుగు భాషపై మమకారం పెరగాలి



మాట్లాడే ప్రాయం నుంచీ తెలుగు భాషపై మమకారం పెరిగేలా పిల్లలను పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. కానీ దురదృష్టవశాత్తు నేడు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలనలు 'అమ్మా-నాన్న' అనిపించుకోవడానికి విముఖత చూపుతూ 'మమ్మీ-డాడీ' వంటి పాశ్చాత్య పదాలతో పిలిపించుకొని మురిసిపోతున్నారు. ఇక పాఠశాలల్లో కూడా తెలుగు మాధ్యమాలకు దూరంగానే చదువులు చెప్పిస్తున్నారు. మాతృభాషలో అర్థమయ్యేలా పరభాషలో అర్థం చేసుకోవడం చాలా కష్టం. చాలామంది గొప్ప గొప్ప వాళ్లంతా తమ చదువులు మాతృభాషలో కొనసాగించిన వారే. దాన్ని గుర్తించాలి. భాష అనేది ఒక భావప్రసారం లాంటిది. అది వ్యక్తుల మధ్య చక్కగా ఉంటేనే మంచి ప్రయోజనాలు ఉంటాయి. లేకపోతే భవిషత్తులో ఇబ్బందులే ఏర్పడతాయి. బాలలు సులువుగా తెలుగులో చదువుకునేందుకు 50కి పైగా పుస్తకాలు రాశాను. ఇందులో అనేక ప్రయోగాలతో కూడిన పుస్తకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి.

- డాక్టర్ ఎం.హరికిరణ్, బాలల సాహిత్య రచయిత, కర్నూలు

తెలుగులో రచనలే నాకు గుర్తింపు తెచ్చాయి



తెలుగు భాషలో రాసిన కవిత్వమే నాకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. కవిత్వమే లేకుంటే నేను ఒక సాదాసీదా మహిళగా మిగిలిపోయేదాన్ని. అనేక సామాజిక అంశాలపై 200 కవితలు రాశాను. పూల నిప్పులు, వెన్నెల కురవని రాత్రి కవితా సంపుటిలు వెలువరించాను. వృత్తిరీత్యా నేను టైలరింగ్ మాస్టర్‌ను. ప్రవృత్తి పరంగా రచనా వ్యాసాంగం ఎంచుకున్నాను. నా పుస్తకాలు చదివిన కొలుకలూరి ఇనాక్, సినీ నటుడు తనికెళ్ల భరణి, కార్టూనిస్టు, రచయిత టీ్నం వంటి వారు ప్రశంసలు కురిపించారు. మన తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా స్వీకరించాలి. మన భాష దూరమైపోతే మన సంస్కృతిని మనం దూరం చేసుకున్నట్లే అవుతుంది.

- జె.స్వయంప్రభ, కవయిత్రి, ఎమ్మిగనూరు

భాషాభివృద్ధికి గిడుగు కృషి మరువలేనిది



తెలుగు వ్యావహారిక భాషా అభ్యున్నతికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషి అమోఘం. ఒకప్పుడు ప్రాచీన సాహిత్యంతో కూడిన తెలుగు గ్రాంథిక భాష చాలామందికి అర్థమయ్యేది కాదు. ఈ ఇబ్బందులను గుర్తించిన గిడుగు రామ్మూర్తి అర్థం లేని భాష వ్యర్థం అన్న నానుడితో తెలుగు వ్యావహారిక భాషాభివృద్ధికి పూనుకున్నారు. తొలుత ఆ ప్రయత్నానికి అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ చివరకు తెలుగు ప్రజలందరు వ్యావహారిక భాషపైనే మక్కువచూపారు. ప్రత్యేకించి నేటి ఆధునిక కవుల కవిత్వాలు శిఖరాగ్రస్థానికి చేరుకోవడంలో గిడుగు పాత్ర ఎంతో కీలకం.

- డాక్టర్ సుజాత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరు



తెలుగు పాటల్లో కమ్మదనం ఉంది



'ఇంటి పేరు గిడుగు... నీవంటే ఒక పిడుగు... జీవభాష కోసం నీ జీవితాన్ని ఇచ్చావు.. గిడుగు రామమూర్తి నీవే మా స్ఫూర్తి...' అంటూ ఆ మహనీయుడిని కీర్తించే అవకాశం నాకు పాట ద్వారా కలిగింది. మనం మాట్లాడే భాష, వాడుకలోని భాషను అధికారికంగా అమలు చేయాలని గిడుగు రామమూర్తి పంతులు చేసిన దశాబ్దాల పోరాటం ప్రతి తెలుగు వారూ గుర్తుంచుకోవాలి. లలితమైన తెలుగు భాషలో సలితమైన తెలుగు పాటలు కూడా పరిమళాలను వెదజల్లుతాయి. తెలుగు భాషలో నేను రాసిన పాటలు నాకు ఎంతో పేరు ప్రతిష్టలు తీసుకువచ్చాయి. ఇది కేవలం ఆ భాష మహిమే. ఆ భాష గొప్పదనమే. మనం ఇంగ్లీషులో ఎంత మాట్లాడినా, రాసినా ఒక ఆంగ్ల పాటను వినసొంపుగా వినగలమా..? అందుకే మన మాట, బాట, ఆశ, శ్వాస తెలుగే కావాలి.

- ఎలమర్తి రమణయ్య, కవి, పాటల రచయిత, కర్నూలు

తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం



నేటి సమాజంలో తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం. దేశ భాషలెందు తెలుగు లెస్స అంటూ విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాషా కీర్తిని చాటిచెప్పగా వ్యవహారిక భాషా ఉద్యమంతో తెలుగు భాషా గొప్పదనాన్ని ప్రపంచవ్యాప్తంగా గిడుగు రామ్మూర్తి పంతులు తీసుకెళ్లారు. ఇంతటి గొప్ప చరిత్ర వున్న తెలుగు వ్యావహారిక భాషకు నేడు ఆదరణ లేకపోవడం బాధాకరం. ఇటీవల పలు అధికార ఉత్తర్వుల్లో కూడా తెలుగు భాషలో అచ్చుతప్పులు రావడం గమనించుకోవాల్సిన అంశం. ఇకనైనా తెలుగు ప్రజాల్లారా స్పందించండి.. తెలుగు భాషాను కాపాడుకుందాం.

- విద్యాసాగర్, తెలుగు అధ్యాపకుడు, ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు

తెలుగు భాషకు 'పెద్ద' రాముడు

మాతృభాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు



కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):నగర పాలక సంస్థ మేనేజర్ ఎస్.చిన్నరాముడికి తెలుగు భాషపై ప్రత్యేకమైన అభిమానం ఉంది. ఆయన సంతకాలు, తాపాలా, మార్గదర్శకాలు అన్నింటిని తెలుగులోనే రాస్తారు. నేటి కాలంలో అధికార భాషగా ఆంగ్లం ఎక్కువగా వాడుతున్న కూడ అధికారి అయిన చిన్నరాముడు మాత్రం తన మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తూ 'పెద్ద'రాముడిగా ఖ్యాతి పొందారు. ఆయన ఈ అలవాటు సహచర ఉద్యోగుల్లోనూ ఒక మార్పు తీసుకువచ్చింది. కార్యాలయంలో పత్రాలు, నోటీసులు తెలుగులో రావడానికి ప్రోత్సాహం లభిస్తుంది. ప్రజలు సులభంగా అర్థం చేసుకునేలా అధికారిక సమాచారాన్ని తెలుగులో అందించడం ఆయన ముఖ్యలక్ష్యం. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషపై చిన్నరాముడు చూపుతున్న ఈ మక్కువతో ఆయన ఆచరణ సహచరులకు ప్రేరణగా, ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోంది.

భాషను బతికించుకోవాలి



తెలుగు భాషను నేడు తెలుగు దిన, వార, మాస పత్రికలు, టీవీ, సినిమా వంటి మాధ్యమాలే బతికిస్తున్నాయి. మొదటి నుంచి 'పొరుగింటి పుల్లగూర...'చందంగా మన పరిస్థితి, బతుకులు మారాయి. మన గొప్పదైన తెలుగు భాష కన్నా పరాయివాడు మాట్లాడే ఆంగ్ల భాషను ఇష్టపడతాం. మనం కట్టే పంచెకట్టు కన్నా ఆంగ్లేయుడు వాడే టై కోటును ఆశపడతాం. మారుతున్న కాలంలో కొంత మార్పులు అవసరమే అయినా, మన మూలాలను విడిచిపెట్టకూడదు. తెలుగు భాషలో చదువుకోకున్నా, భాష పట్ల నిర్లక్ష్యం వద్దు. తెలుగుకు సంబంధించిన గొప్ప పుస్తకాలు ఉన్నాయి. చదవండి. వాటిలోని మాధుర్యాన్ని ఆస్వాదించండి. తెలుగు కథలు ఎంతో హృద్యంగా సాగిపోతుంటాయి. మన భాషలో గొప్ప నాగరికత, సాంస్కృతికత, కుటుంబ, సామాజిక బాంధవ్యాలు గొప్పగా ఉంటాయి. భాషను ఆస్వాదించే వారికి గొప్ప అనుభూతే మిగులుతుంది.

- జి.ఉమామహేశ్వర్, కథా రచయిత, కర్నూలు

మాతృభాషలో నాటకానికి విశిష్ట స్థానం



ఏ ఇతర భాషలకూ లేని విశిష్టత తెలుగు భాషకు ఉంది. ఈ భాషలో పద్య నాటకాలు ప్రత్యేకం. పద్య నాటకాలు ప్రపంచంలోని ఏ ఇతర భాషల్లో కనిపించవు. తెలుగు భాష ఔన్నత్యాన్ని, విశిష్టతను చాటిచెప్పిన ఘనత పౌరాణిక, పద్య నాటకాలకూ దక్కుతుంది. 1992 నుంచి నాటక రంగంలో అనేక నాటకాలు వేశాను. మన భాషలో పలికే సంభాషణలు గంభీరంగా, అర్థవంతంగా నిలుస్తాయి. అలాగే పద్యాలాపన కూడా ఒక ప్రత్యేకంగా సాగుతుంది. దుర్యోధనుడు, భీముడు, నల కుబేరుడు, రావణ, విశ్వామిత్ర, చింతామణిలో భవానీశంకరం వంటి పాత్రలు మంచి గుర్తింపు తెచ్చాయి. జిల్లా తెలుగు దేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగానూ తెలుగు భాష ప్రాచుర్యానికి కృషి చేస్తున్నా. ఘనతర చరిత్ర గల తెలుగు భాషను పరిరక్షించుకోవడంలో అందరూ భాగస్వామ్యం కావాలి.

- పి.హనుమంతరావు చౌదరి, రంగస్థల నటుడు, కర్నూలు

నేటి నుంచి టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవాలు

● రేపు 24 గంటల నిర్విరామ పద్యనాటక ప్రదర్శనలు



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలను మూడు రోజుల పాటు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య వెల్లడించారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా మూడు రోజుల తెలుగు భాషా దినోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటలకు తెలుగు తల్లి, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు నివాళి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం 'విద్య, బోధనలో తెలుగు భాష' అనే అంశంపై హైస్కూల్, కలాశాలల విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. హైస్కూలు విద్యార్థులను జూనియర్స్‌గా, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులను సీనియర్స్‌గా పరిగణిస్తామని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు.

'రికార్డు' దిశగా పద్యనాటక పోటీలు

తెలుగు భాషా దినోత్సవం వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో పౌరాణిక, చారిత్రక ఏకపాత్రాభినయ పోటీలు ప్రారంభమవుతాయి. 80 మంది కళాకారులతో పగలు, రాత్రి ఏకధాటిగా 24 గంటల పాటు పద్య నాటక ప్రదర్శనలు కొనసాగుతాయి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు సంస్థ ప్రతినిధులు ఈ ప్రదర్శనలను తిలకించి రికార్డుల్లో నమోదు చేయనున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం, సత్కారం ఉంటుంది. అలాగే నగదు ప్రోత్సాహకాలు ఉంటాయి.

● 31న పుస్తక ఆవిష్కరణ : తెలుగు భాషా దినోత్సవాలు చివరి రోజున ఆదివారం ఉదయం 10 గంటలకు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య రాసిన 'పదవి మూలం... ఇదం జగత్' పుస్తక ఆవిష్కరణ నగర ప్రముఖులచే ఉంటుంది. సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం, అనంతరం తెనాలి ఆరాధ్యుల నాటక సమాజం వారిచే 'ఎవరు' సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని ఓబులయ్య తెలిపారు. ఈ సమావేశంలో కార్యక్రమాల కోఆర్డినేటర్లు పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, వీవీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలుగుతోటలో వేడుకలు..

కర్నూలు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని తెలుగు కళాస్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ ఎండీ ఇనాయతుల్లా, ఎస్ఎస్ పటేల్, కన్వీనర్ మహమ్మద్ మియా ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోట సమావేశ హాలులో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర, అధ్యక్షులుగా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధర రెడ్డి, విశిష్ట అతిథిగా తెలుగు భాషావికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ హాజరవుతారని తెలిపారు. ఈ సభలో గిడుగు స్మారక పురస్కారాలు ఎస్‌డీవీ అజీజ్, టి. వెంకటేశ్, పి. మారుతి, నాగమణి, కెంగార మోహన్‌కు అందజేస్తారని తెలిపారు.

వయోజన విద్యాశాఖలో ఖాళీల భర్తీకి ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖలో ఉమ్మడి జిల్లాలో ఐదు సూపర్‌వైజర్ పోస్టులకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నట్లు వయోజన విద్య సంచాలకులు చంద్ర శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని వయోజన శాఖలో సూపర్‌వైజర్లుగా పనిచేసేందుకు ఎస్జీటీలు, బాషా పండితులు, పీఈటీలు 45 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తులను అందజేయాలని ఆయన కోరారు.

జైజై గణేశా..!

● ఘనంగా ఆరంభమైన గణేశ్ నవరాత్రి వేడుకలు



ఆదోని : ఆపరేషన్ సింధూర్‌లో విజయం సాధించిన అవతారంలో పూజలు అందుకుంటున్న వినాయకుడు



నంద్యాలలో బాలాజీ కాంప్లెక్స్‌లో విశ్వశాంతి మహాగణపతి



ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో తామర విత్తనాలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



ఆదోని ఎలీబీ స్ట్రీట్‌లో ఎండుకొబ్బరితో తయారు చేసిన వెంకటేశ్వరుడి ఆకారంలో వినాయకుడు



అనంతపద్మనాభ స్వామి ఆకారంలో వినాయకుడు



కోడుమూరులో సాంస్కృతిక నృత్య ప్రదర్శన




నంద్యాల సంజీవనగర్ రామాలయంలో అరటికాయలతో మహాగణపతి

కర్నూలు/నంద్యాల కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హిందువుల తొలి ఆరాధ్యదైవం విఘ్నేశ్వరుడి జన్మదిన వేడుక వినాయక చవితిని బుధవారం ఉమ్మడి జిల్లావాసులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తమ గృహాల్లోని పూజా మందిరాల్లో చిన్న చిన్న మట్టి ప్రతిమలతో రూపొందించిన గణపతి మూర్తులను ప్రతిష్ఠించి ధూప దీప నైవేద్యాలతో షడ్రోపేత పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వినాయక చవితి మొదలు తొమ్మిదిరోజుల పాటూ కొనసాగే 'గణేశ్ నవరాత్రి' ఉత్సవాల సందడి ఆరంభమైంది. అంబరాన్ని అంటే సంబరాలతో ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీల నిర్వాహకులు పార్వతీ నందనుడి మంటపాలకు తరలించి, పూజలతో ఉత్సవాలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో పోటాపోటీగా భారీ విగ్రహాలను నెలకొల్పారు. ఈ ఏడాది గణేశ్ ఉత్సవాల్లో విగ్రహాలు వేటికవే ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. విభిన్న రూపాల్లో వినాయక ప్రతిమలు భక్తులకు దర్శనమిస్తున్నాయి.



ఎమ్మిగనూరులో వీణాపాణిగా దర్శనమిస్తున్న వినాయకుడు



కోసిగిలో బాలకృష్ణుడు అవతారంలో..



నారాయణగుంత కాలనీలో పూజలందుకుంటున్న మహాయోగి లక్ష్మమ్మవ్వ, వినాయకుడు

యజమానులపై దాడి.. గొర్రెల అపహరణ

కొలిమిగుండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం, అబ్దులాపురం గ్రామాల మధ్య మంగళవారం అర్ధ రాత్రి యజమానులపై దాడి చేసి 11 గొర్రెలను అపహరిం చుకొని వెళ్లారు. మదనంతపురం గ్రామానికి చెందిన చిగిరి చిన్నరంగప్ప కుమారుడు రామకృష్ణ దేవుని మాన్యంలో గొర్రెల మంద తోలారు. గొర్రెలు బెదురుకోవడంతో తండ్రి, కుమారుడు లేచి, టార్చ్ లైట్లు వేశారు. దీంతో వారిపై దొంగలు రాళ్లతో దాడి చేశారు. దీంతో చీకట్లో కొద్ది దూరం పరుగెత్తిన వారు గ్రామంలో వారికి సమాచారం అందించగా, గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే దొంగలు మందలోని 11 గొర్రెలను అపహరించి పరారైనట్లు తెలిపారు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెక్ బౌన్స్ కేసులో ఉపాధ్యాయుడికి జైలు

కర్నూలు లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుకు బదులుగా చెల్లని చెక్ ఇచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఏడాది జైలు, చెక్కు మొత్తం జరిమానాగా చెల్లించాలని ఆదేశిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.అనిల్ కుమార్ గురువారం తీర్పు చెప్పారు. నగరానికి చెందిన ఎస్కే మద్దిలేటి 2020లో నాలుగు దఫాలుగా రూ.8లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరి నోటును కె.మనోహర్‌కు రాసిచ్చారు. ఎస్కే మద్దిలేటి 2021 మార్చి 12న రూ.8లక్షలు విలువైన బ్యాంకు చెక్కును మనోహర్‌కు ఇచ్చారు. ఆ చెక్కును మనోహర్ తన బ్యాంకు ద్వారా విత్‌డ్రా కోసం పంపారు. అయితే ఉపాధ్యాయుడి ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో ఆ చెక్కు బౌన్స్ అయింది. దీంతో మనోహర్ కోర్టులో కేసు దాఖలు చేశారు. ఉపాధ్యాయుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది కారాగార శిక్ష, చెక్కు మొత్తం జరిమానాగా ఫిర్యాదికి చెల్లించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

వేరుశనగ మిషన్ బోల్తా

- మహిళా కూలీ మృతి.. ముగ్గురికి గాయాలు

ప్యాపిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామం సమీపంలో గురువారం వేరుశనగ మిషన్ వాహనం బోల్తా పడి ఓ మహిళా కూలీ మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. గుడిపాడు గ్రామానికి చెందిన కళావతి(33), నాగమ్మ, వెంకటలక్ష్మి, నాగభూషణంరెడ్డి వేరుశనగ మిషన్ దగ్గర పనిచేయాడానికి వెళ్లారు. మిషన్ వాహనంలో కుర్చొని పొలానికి బయలుదేరారు. మార్గం మధ్యలో వాహనం బోల్తా పడి కళావతికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్యాపిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

వెల్దుర్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో రామళ్లకోట గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. రైతు కొట్టం రామానాయుడు(33) తన కున్న ఎకరన్నర పొలంలో మొక్కజొన్న సాగుచేశాడు. బుధవారం సాయంత్రం పొలానికి నీరు కట్టడానికి వెళ్లాడు. మోటర్ స్టాటర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రాత్రి అవుతున్నా రాలేదని భార్య పద్మావతి వెళ్లి చూడగా విగతజీవిగా పడిఉన్నాడు. సాయంత్రం అవుతున్నా రాకపోవడంతో భార్య పద్మావతి పొలానికి వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబసభ్యుల సాయంతో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రామానాయుడు(ఫైల్)

ట్రాక్టర్ ప్రమాదంలో బాలుడు..

దేవనకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పనగుర్తి గ్రామంలో పొలంలో ఉల్లి దిగుబడిని లోడ్ చేస్తుండగా ట్రాక్టర్ ఎక్కడంతో బాలుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహేష్, శ్రావణి దంపతులకు ఇద్దరు కుమారులు. బుధవారం తమ పొలంలో ఉల్లి పంటను కోసేందుకు వెళ్తు రెండో కుమారుడు ఈశ్వంత్‌ను తీసుకెళ్లారు. పంటను ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా బాలుడిని గమినించక నడపటంతో ట్రాక్టర్ బాలుడిపై ఎక్కడంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. సీఐ వంశీనాథ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.


ఈశ్వంత్(ఫైల్)

పాము కాటుతో యువకుడు..

డోన్ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో పాము కాటులో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో పొలం పనులు చేస్తుండగా.. బి.సతీష్ కుమార్‌ను పాము కాటు వేయడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు.


పోక్సో కేసు నమోదు

నంద్యాల టౌన్, ఆగస్టు 28 ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ బాలికపై అత్యాచారం చేసిన వారిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అస్రర్‌బాషా గురువారం తెలిపారు. సీఐ వివరాల మేరకు... నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన యువకులు ఆబిద్, అఫ్రోజ్ బాలికకు గత కొంతకాలంగా మాయమాటలు చెప్పి లోబరుచుకుని అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆ బాలికకు కడుపు నొప్పి రావడంతో విషయాన్ని తన తల్లికి చెప్పింది. రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చూపించగా గర్భవతి అని తెలిసింది. దీంతో తల్లి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్య పరీక్షల కోసం బాలికను జీజీహెచ్‌కు తరలించారు.

ప్రేమ జంటలే టార్గెట్!

- వారిని బెదిరించి దోపిడీ చేస్తున్న ముఠా అరెస్టు

కర్నూలు క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రేమ జంటలను బెదిరించి దోపిడీ చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ విక్రమసింహ, ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా.. గోర్లగుట్ట నాగేంద్రుడు (ముజఫర్‌నగర్), కురువ రమేష్ (టీవీ9 కాలనీ), దూదేకుల మాలిక్ బాషా (దిన్నెదేవర పాడు)లు ముఠాగా ఏర్పడి ప్రేమ జంటలను వెంబడించి వారి ఫొటోలను తీసి బెదిరించేవారు. జంటల నుంచి డబ్బు, బంగారు బలవంతంగా లాక్కుని పరారయ్యేవారు. ఈ క్రమంలో ఈ నెల 19న ఓ యువతి తన స్నేహితుడితో కలిసి రాయలసీమ యూనివర్సిటీ వైపు వెళ్తుండగా.. హ్యాంగ్ అవుట్ హోటల్ వద్ద నిందితులు వీరి ఆటోను ఆపారు. యువతి అతని స్నేహితుని ఫొటోలు తీసి మీ తల్లిదండ్రులకు చెబుతామని కత్తితో బెదిరించి బంగారు గొలుసు, నగదు లాక్కుని పరారయ్యారు. మరో రెండు రోజుల తర్వాత ఆ యువతికి ఫోన్ చేసి మరోసారి డబ్బు డిమాండ్ చేశారు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులను పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి కారు, స్కూటీ, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.


నిందితులను చూపుతున్న పోలీసులు

మళ్లీ ఉల్లి పతనం

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం మన దేశంలోని పశ్చిమ బెంగాల్, కర్నాటక, తమిళనాడు, ఒడిసా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసే పరిస్థితులు లేవు. సరిహద్దులు మూసివేయడంతో ఇతర దేశాలకు కూడా ఇక్కడి నుంచి అమ్ముడుపోవడం లేదు. దీంతో పాటు మహారాష్ట్రలో ఉల్లి సాగు ఎక్కువగా కావడం వల్ల సోలార్, తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దేశంలోని వివిధ ప్రాంతాలకు అక్కడి వ్యాపారస్థులు సరఫరా చేస్తున్నారు. నేల స్వభావాన్ని పట్టి ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న ఉల్లి ఎక్కువ రోజులు మన్నిక ఉండదని, కేవలం 10 రోజులకు మించి ఉండకపోవడం వల్ల కుల్లిపోయే పరిస్థితి ఉండటం వల్లనే రైతుకు గిట్టుబాటు కావడం లేదని అధికారులు చెబుతున్నారు.

2020 నుంచి 2025 వరకు కర్నూలు మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చిన ఉల్లి

సంవత్సరం	క్వింటాళ్లు
2020-21	3,76,941
2021-22	4,46,793
2022-23	3,51,101
2023-24	4,41,525
2024-25	6,57,785
2025-26	54,874 (ఇప్పటి వరకు)

అధికారుల ఉక్కిరి బిక్కిరి

గత సంవత్సరం సెప్టెంబరు నెలలో ఉమ్మడి జిల్లాల రైతులు 12వేల క్వింటాళ్ల ఉల్లిని కర్నూలు మార్కెట్‌యార్డుకు అమ్మకానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం ముందస్తు వర్షాల కారణంగా మే నెలలోనే ఉల్లి సాగును రైతులు మొదలెట్టారు. ప్రస్తుతం ఆ ఉల్లి కోతకు వచ్చింది. రోజు పదివేల క్వింటాళ్ల దాకా ఉల్లి కర్నూలు మార్కెట్ యార్డుకు పోటెత్తుతోంది. మరో వైపు వర్షాలు పడుతుం డటంతో పొలాల్లోనే ఉల్లిని ఉంచలేక రైతులు యార్డుకు తెస్తున్నారు. కొంత మంది రైతులు అయితే.. వాహనాలకు కూడా డబ్బులు లేక కూలీల ఖర్చులు భరించలేక కనీస ధర కూడా యార్డులో లభించ లేదనే సమాచారం తెలుసుకుని పశువులకు మేతగా వదిలేస్తున్నారు. ఉల్లిని కొనుగోలు చేసేందుకు కర్నూలు మార్కెట్‌యార్డులో 30 మంది దాకా లైసెన్సులు తీసుకున్నారు. వీరిలో కేవలం 10 మంది మాత్రమే రైతుల నుంచి ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. లైసెన్సు తీసుకున్న 30 మంది వ్యాపారస్థుల చేత కొనుగోలు చేయించడంతో పాటు టెండరును 10 గంటలకే పూర్తి చేస్తే ఎప్పటికప్పుడు సాయంత్రంలోపు ఉల్లి కొనుగోలు పూర్తవుతాయనీ, తమకు రోజుల తరబడి యార్డులోనే ఉండాల్సిన అవసరం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

పరిస్థితిని చక్కదిద్దుతాం



గత సంవత్సరం కంటే ఈసారి కర్నూలు యార్డుకు ఊహించని రీతిలో ఉల్లిగడ్డలు అమ్మకానికి వస్తున్నాయి. అయినా పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు గ్రామాల్లోనే ఉల్లిని గ్రేడింగ్ చేసి అమ్మకానికి తెస్తే మంచి ధర లభించడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి ధర కొద్దిగా తక్కువగా ఉంది. రైతుల పరిస్థితిపై మంత్రులు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. త్వరలోనే ప్రభుత్వం రైతులకు అనుకూలంగా నిర్ణయాన్ని తీసుకుంటుందని ఆశిస్తున్నాము.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

ఉల్లి రైతులు ఆందోళన చెందొద్దు


ఉల్లి రైతులతో మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులు ఆందోళన చెందవద్దని మార్కెటింగ్ జేడీ రామాంజనేయులు సూచించారు. గురువారం కడప నుంచి వచ్చిన మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులను పరామర్శించారు. ప్రస్తుతం ధర ఎంత ఉంది?, పంట సాగుకు ఎంత ఖర్చు చేశారు?, గిట్టుబాటు అవుతుందా? లేదా? అనే అంశాలపై రైతులను ఆరా తీశారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని, క్వింటం ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. తక్షణమే రైతుల నుంచి 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేసి ప్రభుత్వ గోదాములు, ప్రైవేటు కమ్యూనిటీ హాలులో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు ఉన్న ప్రతి వ్యాపారి వేలం పాటలో పాల్గొనేలా చూడాలని కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని ఆదేశించారు. త్వరితగతిన ఉల్లి కొనుగోలు జరిగేలా టెండర్లు నిర్వహించాలన్నారు. పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉల్లి నిల్వలతో పాటు రైతులతో మాట్లాడారు.

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

- సర్వర్ మొరాయింపుతో అర్ధరాత్రి దాకా కొనసాగిన ప్రక్రియ
- ఇబ్బందులు పడిన డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రారంభమైంది. సర్వర్ డౌన్ కారణంగా ప్రక్రియ నత్తనడకన కొనసాగింది. గురువారం మొదటి రోజు సాయంత్రం 6 గంటలకు 1,050 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల ప్రక్రియ పూర్తయింది. కాల్ లెటర్స్ వచ్చిన అభ్యర్థుల సమస్యలను పరిష్కరించడంలో విద్యాశాఖ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెగా డీఎస్సీలో ఎస్‌జీటీ 1827, స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజ్) 314, స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజ్) 537 పోస్టుల భర్తీకి మెరిట్ కం రోస్టర్ ప్రకారం అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. కర్నూలు నగరంలోని రాయలసీమ విశ్వవిద్యాలయం, నన్నూరు సమీపంలోని మారుతి ఎస్టేట్‌లోని శ్రీ రాఘవేంద్ర బీఈడీ కళాశాల, శ్రీనివాస బీఈడీ కళాశాలలో అభ్యర్థుల పరిశీలన కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 54 వెరిఫికేషన్ కేంద్రాలను నియమించారు. ఒక్కో బృందంలో ఎంఈవో, హెచ్‌ఎంలు, డిప్యూటీ తహసీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. ఓపెన్ కేటగిరిలో ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులు 336 పోస్టులు సాధించారు. ఎస్జీటీలోనే 133 మంది పోస్టులకు ఎంపికయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అభ్యర్థుల కంటే శ్రీకాకుళం, విజయనగరం తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ప్రకాశం జిల్లాల అభ్యర్థులు ఓపెన్ కేటగిరిలో నాన్ కేటగిరి పోస్టులను అత్యధికంగా దక్కించుకున్నారు.

అవస్థలు పడిన అభ్యర్థులు

కొంత మంది అభ్యర్థులు కాల్‌లెటర్లు మెసేజ్‌లు రాకున్నా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రాల వద్ద చేరుకున్నారు. తమ కంటే తక్కువ మార్కులు, ర్యాంకులు వచ్చిన వారికి కాల్ లెటర్స్ ఎలా పంపి స్తారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో ఒకే కేటగిరికి చెందిన అభ్యర్థికి 81వ ర్యాంకు వచ్చినా తనకు కాదని 105, 106 ర్యాంకులు వచ్చిన అభ్యర్థులకు కాల్ లెటర్స్ రావడం పట్ల విద్యాశాఖ అధికారుల వద్ద తమ బాధను వెల్లబోసుకున్నారు. అలాగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం కాల్ లెటర్స్ వచ్చిన అభ్యర్థికి కటాఫ్ డేట్ తర్వాత విద్యార్హతకు సంబంధించిన యూనివర్సిటీ సర్టిఫికెట్లు జారీ చేసిన తేదీల్లో వ్యత్యాసం ఉండటంతో విద్యాశాఖ అధికారులు వెరిఫికేషన్‌కు నిరాకరించడంతో అభ్యర్థులు ఆందోళనలకు గురయ్యారు. ఎస్‌జీటీ పోస్టుకు పరీక్ష రాస్తే స్కూల్ అసిస్టెంట్లు, పీజీటీ పోస్టులకు కాల్ లెటర్స్ రావడం పట్ల అభ్యర్థులు అవాక్కయ్యారు. సాంకేతక కారణాలు తలెత్తడంతో మెగా డీఎస్సీ ఎంపిక సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వచ్చిన అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం జిల్లా విద్యాశాఖ అధికారుల పరిధిలో లేకపోవడంతో రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గెజిటెడ్ ఆఫీసర్ల సంతకం చేయించుకోకుండానే హాజరైన పలువురు అభ్యర్థులు సంతకాల కోసం అభ్యర్థులు అధికారుల చుట్టూ తిరుగుతూ ఒత్తిడికి గురయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్‌ఎంలతో అభ్యర్థుల సర్టిఫికెట్లకు అటెస్టేషన్ చేయించడంతో ఊరట చెందారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, ఆప్టా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షులు రవికుమార్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేంద్రాల్లో అభ్యర్థుల సమస్యలను తెలుసుకుని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

అర్ధరాత్రి వరకూ కొనసాగిన పరిశీలన..

మొదటి రోజు 2,307 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన అర్ధరాత్రి వరకూ కొనసాగిది. వీరే కాకుండా మరో 260 మంది అభ్యర్థులకు గురువారం రాత్రి కాల్‌లెటర్స్ విడుదల కానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెప్పారు.

పరిశీలించిన అధికారులు

ఆర్‌యూలో సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని జేసీ నవ్య పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్ర పాఠశాలల విద్య ఏడీ ప్రతాప్ రెడ్డి, అబ్రహాం, డీఈవో శామ్యూల్‌పాల్ కేంద్రాలను పర్యవేక్షించారు.

అహోబిలం మెట్ల మార్గంలో విరిగిపడ్డ కొండచరియలు


అహోబిలంలో మెట్ల మార్గంలో విరిగి పడిన కొండ చరియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలోని మెట్లమార్గంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల బుధవారం తెల్లవారు జామున ఎగువ అహోబిలానికి వెళ్లే మెట్ల మార్గంలో సరిగ్గా భక్తులు పైకి ఎక్కే మెట్ల వద్ద కొండ చరియ విరిగిపడింది ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఈ కొండ చరియ చెట్టు, విద్యుత్ స్తంభం తాకుతూ పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ తీగలు సైతం మెట్ల మార్గంలో పడిపోయాయి. భక్తుల సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఆలయ అర్చకులు తెలిపారు. ఎంపీడీవో నూర్జహాన్, విద్యుత్ ఏఈ కృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకొని కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

పిచ్చికుక్క దాడి.. ఐదుగురికి గాయాలు


తీవ్రంగా గాయపడ్డ మస్తాన్‌సాబ్

ఆలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో గురువారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. జనంపై దాడి చేసి ఐదుగురిని గాయపరిచింది. ఈ దాడిలో మస్తాన్‌సాబ్, గౌతమ్, నాగప్ప, నబీ, షాషావలి గాయపడ్డారు. వీరిని గ్రామస్థులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మస్తాన్‌సాబ్, గౌతమ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు.

టమోటాకు తెగులు.. రైతుకు దిగులు

- వర్షం ప్రభావంతో కాయలకు మచ్చలు
- పంటను వదిలేసిన రైతులు


టమోటాను తొలగిస్తున్న కూలీలు

తుగ్గలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో టమోటా పంట దెబ్బతిని రైతులు నష్టపోయారు. మండలంలో ఈ ఖరీఫ్‌లో దాదాపు 2వేల ఎకరాల్లో టమోటా సాగు చేశారు. మొదట్లో వర్షాలు కురువకపోవడంతో రైతులు నీళ్లు పోసి మొక్కలను నాటారు. ఎన్నో ఇబ్బందులు, వ్యవ ప్రయాసలకోర్చి పంటను కాపాడుకున్నారు. మొక్కలు బాగా పెరగడంలో మంచి దిగుబడి వస్తుందని, దర కూడా బాగా ఉండటంతో ఈ ఏడాది కలిసొస్తిందని ఆశపడ్డారు.


రూ.1.10లక్షలతో సాగు చేశా



మూడున్నర ఎకరాల్లో దాదాపు రూ.1.10 లక్షలు ఖర్చుపెట్టి టమోటా సాగు చేశాను. మొక్కల కొనుగోలు, వాటిని బతికించుకోవడానికి వ్యయప్రయాసలకు గురయ్యారు. తీరా దిగుబడి వచ్చే సమయానికి భారీ వర్షాలు కురి పంట కుల్లి పోయింది. చెడిపోయిన కాయలను తీసివేయడాని కూలీలకే రూ.5వేలు అయింది. **- రఘు, జొన్నగిరి, తుగ్గలి మండలం**

ముంచిన వర్షం

దిగుబడి వచ్చే సమయంలో 15 రోజుల పాటు వర్షాలు కురవడతో పంట దెబ్బతింది. టమోటా కాయలకు మచ్చ తెగులు సోకి కాయలు నాశనయ్యాయి. దీంతోపాటు చెట్టుకు కూడా తెగులు సోకడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మచ్చలు ఉన్న, కుల్లిపోయిన టమోటాలను ఏరివేసేందుకు కూలీలను నియమించుకున్నారు. దీంతో పెట్టుబడి పెరగగా, కాయలకు మచ్చ రావడంతో వాటిని పొలంలోనే పారవేయాల్సి వస్తోందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు


కుప్పగా పోసిన కుళ్లు, మచ్చ టమోటాలు

తొమ్మిది బార్లకు లైసెన్స్ దరఖాస్తులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 26 బార్లకు లైసెన్సు కోసం దరఖాస్తులు ఆశించిన తీరులో రాలేదు. గురువారం సాయంత్రానికి 9 బార్లకు ఫుల్ సేప్‌లో దరఖాస్తులు పడ్డాయి. ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు, ఆపై ఉంటేనే లాటరీ పద్ధతికి అర్హతగా ప్రభుత్వం పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ క్రమంలో ఈనెల 18న నోటిఫికేషన్ జారీ చేయగా ఈనెల 26తో గడువు దర ఖాస్తు ప్రక్రియను ముగింపుగా ప్రకటిం చారు. కానీ గడువు ముగిసినా ఆశించిన తీరులో ఎవరూ దరఖాస్తూ ప్రక్రి యకు స్పందించకపోవడంతో

నేటితో ముగియనున్న గడువు

ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం గడువును పొడిగించింది. అయినప్పటికి ఆశించిన తీరులో యాజమాన్యాల నుంచి స్పందన కనిపించ లేదు. శుక్రవారం దరఖాస్తు చేసుకునేందుకు వస్తారని ఎక్సైజ్ శాఖ ఆశిస్తోంది. ఇప్పటివరకు ఆదోని-4, కర్నూలు-5 బార్లకు సంబంధించి ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తుల చొప్పున చేసుకున్నారు. ఎమ్మిగనూరు, గూడూరుల నుంచి ఎలాంటి స్పందన లేదు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పార్వతీ తనయ.. పూజలందుకో



నంద్యాల ఎడ్యుకేషన్: పూజల్లో పాల్గొన్న నంద్యాల కలెక్టర్, జేసీ

వినాయక చవితి పర్వదినాన్ని బుధవారం నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మండపాల్లో గణనాథుని విగ్రహాలను వివిధ ఆకృతుల్లో, రంగుల్లో ప్రతిష్ఠించారు. కటౌట్లను పోటాపోటీగా, శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు భోజనాలు, అల్పాహార విందును ఏర్పాటు చేశారు. మండపాల వద్ద భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. మండపాల వద్ద ఆదిదేవుడు వినాయకుడిని కలెక్టర్, జేసీ, ఎస్పీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. అలాగే ఇళ్లలో కూడా వినాయకుని ప్రతిమలను ఉంచి ఇంటిల్లిపాది పూజలు చేశారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఆత్మకూరు: తోటగేరిలో వెలసిన గణనాథుడు



నంద్యాల కల్చరల్: బాలాజీ కాంప్లెక్స్‌లో విశ్వశాంతి మహాగణపతి



పాణ్యంలో..



నంద్యాల టౌన్: పూజల్లో పాల్గొన్న ఎస్పీ, పోలీసు సిబ్బంది



నందికొట్కూరు రూరల్: పూజల్లో పాల్గొన్న మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి



మహానంది: పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, ఈవో



పాములపాడులో..



జూపాడుబంగ్లాలో..



వెలుగోడులో..



బండిఆత్మకూరులో..



నందికొట్కూరు: వినాయకుని సేవలో ఎమ్మెల్యే జయసూర్య



ఆత్మకూరురూరల్: రామాలయం వద్ద కొలువు తీరిన గణనాథుడు



కొత్తపల్లిలో..



ఆత్మకూరులో..

ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

మహానంది, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. గురువారం మహానంది మండలం బుక్కాపురంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్‌తో పాటు ఏవో నాగేశ్వరరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూరియాను నిల్వ చేయడం నేరమన్నారు. ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వల ను తెలిపే పట్టికను దుకాణం ముందు ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ నిల్వలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి

జూపాడుబంగ్లా, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో ఈనెల 23వ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన తరిగోపుల గ్రామానికి చెందిన జయవర్ధన్ (14) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కారు బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

పాణ్యం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంబులా పరమేశ్వరీ ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. నంద్యాల నుంచి కర్నూలుకు కారులో వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతల వైపు బోల్తా పడినట్లు తెలిపారు. ఈ సంఘటనలో నంద్యాల చాంద్‌బాడకు చెందిన డ్రైవర్ మహబూబ్ బాషాకు తీవ్రగాయాలు కావడంతో హైవే పోలీసు సిబ్బంది 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాల్సి ఉందని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

కొత్తూరు ఆలయంలో తలనీలాల వేలం

పాణ్యం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు దేవస్థానంలో గురువారం నిర్వహించిన తలనీలాల వేలాల్లో రూ. 51. 77లక్షలు ఆదాయం చేకూరినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. ఈ వేలంలో 13 మంది పాటదారులు పాల్గొనగా రూ. 41.50 లక్షలకు బనగానపల్లెకు చెందిన బాలాంజనేయులు హెచ్చు పాటదారునిగా నిలిచారన్నారు. సీల్డు టెండరులో ఎవరూ పాల్గొనలేదన్నారు. ఈ టెండరులో గుంటూరు జిల్లా పిడుగురాళ్ల గ్రామానికి చెందిన కాస్మోస్ హేర్స్ ఇంటర్నేషనల్ కంపెనీ రూ.51,77,777కు హెచ్చు పాట కోడ్ చేసినట్లు తెలిపారు. ఈ వేలాల కాలం యేడాది పాటు ఉంటుంద న్నారు. నంద్యాల డివిజన్ దేవదాయ శాఖ అధికారి హరిశ్చంద్రారెడ్డి, గ్రామపెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో అధిక లాభాలు

మహానంది, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకంతో అధిక లాభాలు పొందొచ్చని డీఆర్డీఏ, వెలుగు ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మహా నంది మండలం బుక్కాపురంలోని మండల ఐక్యసంఘం భవనంలో పొదుపు ఐక్యసంఘం మహిళలకు తేనెటీగల పెంపకంపై బజ్, సెర్ఫ్ సహకారంతో ఏర్పాటు చేసిన అవగామన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబం కనీసం రెండు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అందుకు శిక్షణ ఇవ్వడానికి వెలుగు ప్రాజెక్ట్ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌కుమార్, బజ్ కంపెనీ ప్రతినిధి ప్రభాకర్, మండల ఏపీఎం తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పత్తి , శిశు ఆరోగ్యంపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఎన్‌జీవోస్ కాలనీలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బుధవారం పునరుత్పత్తి, శిక్షణ (ఆర్‌సీహెచ్)-2.0 కొత్త వర్షన్‌పై శిక్షణా కార్యక్ర మం డీఎంహెచ్ఓ డా.ఆర్.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని గుర్తింపు పొందిన డాక్టర్లు, సూపర్‌వైజర్లు, స్టాఫ్‌నర్స్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు,ఎంఎల్‌హెచ్‌పీ, డీఈవోలు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ త్వరలో ఆర్సీహెచ్ 1.0 పోర్టల్ 2.0గా మార్పు చెందుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఇస్తున్న సేవలు ఆన్‌లైన్‌లో నమోదుచేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు డాక్టర్లు సుదర్శన్, అంకిరెడ్డి, డీపీవో నాధ్విన్, ఎస్ఓ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

విజయపథంలో విజయ డెయిరీ

● పాడి రైతులకు రూ.22 కోట్ల సహాయం

నంద్యాల రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సహకార సంస్థల మనుగడ కష్టమవుతున్న తరుణంలో నంద్యాల విజయ డెయిరీ మాత్రం విజయపథం వైపు పరుగులు పెడుతున్నట్లు చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం నాలుగు అంశాలపై దృష్టి సారించామన్నారు. రైతులకు రూ.22 కోట్ల సహాయం చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత నాలుగేళ్లలో రూ.17 కోట్లు పాడి రైతులకు అందించామన్నారు. ఉద్యోగులు, కార్మికులకు రూ.3.50 కోట్ల బోనస్ ఇచ్చామన్నారు. గేదెల కొనుగోలుకు 20 శాతం రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు. మరణించిన రైతులకు ఆసరాగా రూ.15 లక్షలు చెల్లించామన్నారు.2024-2025 సంవత్సరంలో రూ.310 కోట్ల వార్షిక ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 1.20 లక్షల లీటర్ల పాల అమ్మకం, అలాగే రోజుకు 1.30 లక్షల లీటర్ల సేకరణ జరుగుతోందన్నారు. అలాగే రూ.36 కోట్లతో డెయిరీలో మరమ్మతులు, అభివృద్ధికి చేపట్టినట్లు వివరించారు.

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పగిడ్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర గురుకుల పాఠశాలల డిప్యూటీ అకాడమిక్ మానిటరింగ్ అధికారి బీవీ. మల్లేశ్వరరావు సూచించారు. గురువారం లక్ష్మాపురం అంచె సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

పాములపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో పండ్ల మొక్కలను వందశాతం రాయితీతో పంపిణీ చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో జయంతి తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో 80 ఎకరాలలో హార్టీకల్చర్ ద్వారా వివిధ రకాల పండ్ల మొక్కలను నాటినట్లు తెలిపారు.

ఎంబీబీఎస్‌కు ఎంపిక



మణిదీపిక



తరుణ్

మహానంది, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్ యూజీ 2025 ఆల్‌ఇండియా ఫలితాలో ఉత్తీర్ణత సాధించారు. గ్రామానికి చెందిన మంగలి మణిదీపిక, పోలిశెట్టి తరుణ్ నీట్ ఫలితాల్లో విజయం సాధించి ఎంబీబీఎస్‌కు ఎంపికైన ట్లు విద్యార్థుల తల్లితండ్రులు గురువారం తెలిపారు.

'నందికొట్కూరు నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో చేర్చాలి'



ధర్నా చేస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గాన్ని నంద్యాల జిల్లా నుంచి కర్నూలు జిల్లాలో చేర్చాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఐసా ఆధ్వర్యంలో నంద్యాల వద్దు... కర్నూలు ముద్దు అంటూ పట్టణంలో ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు నందికొట్కూరు ప్రజల అభిప్రాయాలను వైసీపీ ప్రభుత్వం పక్కనబెట్టి నంద్యాల జిల్లాలో చేర్చిందన్నారు. నాడు వైసీపీ నియోజకవర్గానికి చేసిన అన్యాన్ని నేడు కూటమి ప్రభుత్వం నంద్యాల నుంచి కర్నూలు జిల్లాలో నందికొట్కూరును చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 340 జాతీయ రహదారి ఏర్పడడంతో కర్నూలుకు 24 కి.మీటర్ల దూరంలో నందికొట్కూరు ఉందని, అలాంటిది 60 కి.మీటర్ల దూరంలో ఉన్న నంద్యాలలో చేర్చడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం పరిపాలనా సౌలభ్యం కోసం, విద్యా- ఉపాధి అవకాశాల కోసం నందికొట్కూరు నుంచి కర్నూలుకు అనుసంధానం చేయాల్సిన అత్యవసరం ఉందన్నారు. రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు చెరుకుచర్ల గాబ్రియేలు, ఏసన్న, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాటి విద్యుత్ పోరాట స్ఫూర్తితో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని వామపక్షపార్టీల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పటేల్ సెంటర్‌లో పోలీసుల కాల్పుల్లో మరణించిన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిల చిత్రపటాలకు నివాళలర్పించారు. నాటి బషీర్బాగ్ ఉద్యమ అమరులను స్మరిస్తూ నాటి విద్యుత్తు పోరాట స్ఫూర్తితో పోరాడాలని వారు పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గోపాల్, అరుణ్‌కుమార్, మజీద్‌మియా, సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాల్, కృష్ణ, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, రజిత పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి: సీపీఐ



నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల రూరల్ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్మార్టు మీటర్లను రద్దు చేయాలని, లేకుంటే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని సీపీఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్, ప్రసాద్ డిమాండు చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో టీడీపీ ప్రభుత్వం స్మార్టు మీటర్లు వద్దని, ఇప్పుడు మాత్రం విద్యుత్తు చార్జీలు పెంచుతూ ప్రజల నమ్మకానికి తూట్లుపొడుస్తోందన్నారు. అనంతరం అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు. సీపీఐ నాయకులు మురళీధర్, లక్ష్మీదేవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమరవీరుల బాటలో నడవాలి

ఆత్మకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ కార్మిక అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గౌడ్ సెంటర్ నందు 25వ విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు సుధాకర్, మాబాషా, నాగేశ్వరరావు, వీరన్న, రాముడు, గణపతి, సామేలు, శ్రీను, ఈశ్వరయ్య, రవి ఉన్నారు.

'గురురాజ'లో క్రీడా దినోత్సవం



పోటీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ మౌలాలిరెడ్డి

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని గురురాజ పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడాదినోత్సవాన్ని ఘ నంగా నిర్వహించారు. విద్యార్థులకు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ఆధ్వ ర్యంలో వివిధ క్రీడలు నిర్వహించారు. పోటీల ను గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులకు క్రీడ లు అవసరమన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, సందీప్, సంజీవ, ముని, షఫి, వెంకటరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులేరు వాగు పరిశీలన

కొత్తపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవుల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు శివపురం ఎద్దులేరు వాగు మళ్లీ ఉప్పొంగుతోంది. విషయం తెలుసుకున్న కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి ఆ వాగును గురువారం పరిశీలించారు. వాగుపై వరద ఉధృతి పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ ఎత్తున వాగు పొంగి ప్రవహిస్తుండటంతో వంతెనపై భారీ గుంతలు పడ్డాయి. వాగు దాటే సమయంలో ద్విచక్రవాహనదారులు, ఆటోడ్రైవర్లు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం, సిబ్బంది ఉన్నారు.

వైసీపీ రాజకీయం చేసినా విజయవంతంగా 'డీఎస్సీ' పూర్తి

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంత రాజకీయం చేసినా ప్రభుత్వం డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేసిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. డీఎస్సీకి వ్యతిరేకంగా వైసీపీ దాదాపు 24 కేసులు వేసినా వాటన్నింటికి కోర్టులో ప్రభుత్వం సమాధానం చెబుతూ ఫలితాలను విడుదల చేసి ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు కాల్‌లెటర్లను పంపిస్తోందన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, నందికొట్కూరు సహకార సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, టీడీపీ నాయకులు షకీల్ అహ్మద్, పలుచాని మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గురువారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిల్లో చికిత్స చేయించుకున్న పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో గువ్వల మద్దిలేటికి సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. అనంతరం పట్టణంలోని పలు కాలనీల్లో వెలసిన గణనాథులను దర్శిం చుకుని పూజలు చేశారు. బైరెడ్డి నగర్‌లోని విశ్వకర్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్‌ను మొదలుతో హౌసింగ్ బోర్డు, విద్యానగర్, సుబ్బారావుపేటలలో కొలువుదీరిన గణనాథులను దర్శించుకున్నారు.

నందికొట్కూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కును రహంతుల్లాకు రూ 1,22,500, మేఘనకు రూ 1,95,145, క్రిష్ణాకు రూ.50,250 పంపిణీచేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఖలీలుల్లాబేగ్, కడియం వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ యాదవ్ పాల్గొన్నారు.



బాధితుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సంగపట్నం ఎత్తిపోతల పథకం పునఃప్రారంభం



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

అవుకు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగపట్నం ఎత్తిపోతల పథకం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చొరవతో పూర్వ వైభవం సంతరించుకున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి అన్నారు. గురువారం రామాపురం ఎంపీటీసీ ఎస్.రామకృష్ణారెడ్డి, బనగానపల్లె ఏఎంసీ డైరెక్టర్ మారం పుల్లారెడ్డి, సంగపట్నం రైతులతో కలిసి ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభించారు. సంగపట్నం రైతులు మంత్రి బీసీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ పునరుద్ధరణ

మండలంలోని రామాపురం గ్రామంలో మూసివేతకు గురైన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను మంత్రి బీసీ సహకారంతో ఉగ్రసేనారెడ్డి టీడీపీ నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, పక్కీరగౌడు, పుల్లయ్య, ప్రవీణ్‌రెడ్డి, చిన్నారెడ్డి, సత్యంరెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే నాబార్డు లక్ష్యం: డీడీఎం



పనులను పరిశీలిస్తున్న డీడీఎం కార్తీక్

ప్యాపిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే నాబార్డు లక్ష్యమని ఆ సంస్థ డీడీఎంకేఆర్‌డీ కార్తీక్ అన్నారు. గురువారం మండలంలోని కలచట్ల గ్రామంలో నాబార్డు ఆధ్వర్యంలో జరుగుతున్న వాటర్ షెడ్ పనులను ఆయన పరిశీలించారు. నాబార్డు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దామోదర్‌రెడ్డి, సుబ్రమణ్యం, రాకేష్, రాజా, రవికుమార్, పాల్గొన్నారు.

సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలు

బనగానపల్లె, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు 75శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తోందని వినియోగించుకోవాలని పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య అన్నారు. గురువారం పట్టణంలోని పశువైద్యశాలలో ఏడీ మారుతీసకారం అధ్యక్షతన పశువైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సిబ్బంది ముక్తియార్‌ను సత్కరించారు. సమావేశంలో పశువైద్యులు బ్రహ్మానందారెడ్డి, రాంకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌డీవో శివారెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె డివిజన్ పరిధిలోని కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల పరిధిలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా ఎంపీడీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. ఆయన వెంట బనగానపల్లె, కోవెలకుంట్ల ఎంపీడీవోలు రాధికారెడ్డి, భరణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఐదు రోజుల వరకు అనుమతి ఇవ్వాలి'

చాగలమర్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హిందూవులు సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్న వినాయక చవితి వేడుకలకు ఐదురోజులు అనుమతి ఇవ్వాలని ఎస్ఎస్ఎఫ్ జిల్లా సహకన్వీనర్ సల్లా నాగరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు కోరారు. గురువారం చాగలమర్రి శివరామా నంద ఆశ్రమంలో హిందూ ఐక్యసంఘం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. చాగలమర్రి ఎస్ఐకు, ఆళ్లగడ్డ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో హిందూ సంఘ నాయకులు రమేష్, ఆవుల ప్రతాప్, జయదేవ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

'మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొనకండి'

కొలిమిగుండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సమయంలో మద్యం తాగి వాహనాలు నడపడం, ఉత్సవాల్లో పాల్గొనకూడదని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్ బాబు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండల వ్యాప్తంగా జరిగే నిమజ్జనం ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉత్స వ కమిటీ సభ్యులదేనన్నారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా ప్రశాంతంగా పండుగను జరుపుకోవా లని సీఐ సూచించారు.



డోన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో వినాయక పూజల్లో పాల్గొన్న సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి



అవుకు: రామాపురంలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఉగ్రసేనారెడ్డి



చాగలమర్రిలో..



రుద్రవరంలో..



బేతంచెర్లలో..



శిరివెళ్ల: యర్రగుంట్లలో..



ఉయ్యాలవాడ: ఆర్. జంబులదిన్నెలో..

కొలువుదీరిన గణనాథులు

- వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం
- భక్తిశ్రద్ధలతో బొజ్జగణపయ్యలకు పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



డోన్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల , నాయకులు

డోన్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణనాథులు కొలువుదీరారు. పట్టణంలోని కొండపేట, తారకరామ నగర్, పాతపేట అమ్మవారిశాల, శ్రీనివాస్ నగర్, కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పాతబస్టాండులో సమైక్యాంధ్ర కట్ట వద్ద గణేష్ కేంద్ర మహోత్సవ కమిటీ అధ్య క్షులు వై.హనుమంతరెడ్డి, బచ్చు చక్రి, తిమ్మారెడ్డి, రామకృష్ణ, శంకర్ రెడ్డి, ఈశ్వర్ నాయుడు, ఉష 500 మట్టి విగ్రహాలను భక్తులకు అందజేశారు.

బనగానపల్లె: భక్తి శ్రద్ధలతో ప్రజలు వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పెండేకంటి నగర్‌లో అధిక సంఖ్యలో భక్తులు వినాయక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణంలో 50 చోట్ల వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. పట్టణంలోని బీసీజేఆర్ కూరగాయల మార్కెట్, నాయీబ్రాహ్మణకాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టంగుటూరు శ్రీనయ్య, మల్లారెడ్డి, నాగరాజు, నాగేశ్, శేఖర్, శివయ్య పాల్గొన్నారు.

అవుకు : మండలంలోని ప్రజలు వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గురువారం రెండవ రోజు వినాయకుడి విగ్రహాలకు నిర్వాహకులు, ప్రజలు పూజలు నిర్వహించారు. అవుకులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కర్‌రెడ్డి, రామాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఐ. ఉగ్రసేనారెడ్డి, ఎస్.రామకృష్ణా రెడ్డి, మారం పుల్లారెడ్డి, వెంకటరమణ నాయక్ వినాయకుడి విగ్రహాలకు పూజలు చేశారు.



బనగానపల్లెలో గణేశ్ విగ్రహానికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ



సంజామలలో..



ఆళ్లగడ్డ: సత్రం వీధిలో ...



చాగలమర్రిలో..

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని అయ్యప్ప ఆలయం నుంచి వినాయక విగ్రహాలను ట్రాక్టర్ల ద్వార పురవీధుల గుండా అత్యంత వైభ వంగా గ్రామోత్సవం చేశారు. చెక్కభజన, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా విగ్రహాల కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

రుద్రవరం : మండలంలో వివిధ రూపాల్లోని వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంలోని పడమటి వీధిలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడి , టి.లింగందిన్నె గ్రామంలోని వినాయకుడు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

శిరివెళ్ల : మండలంలోని గ్రామాల్లో ప్రజలు గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. భక్తులు ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ చిన్న పీరయ్య పరిశీలించారు.

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో బొజ్జ గణపయ్యల సందడి నెలకొంది. మండలంలో రికార్డు స్థాయిలో ఈఏడాది 165 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కనకాద్రిపల్లె గ్రామంలో టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి, పెద్దిరెడ్డి, రామలక్ష్మణ్ణ, పెద్ద వెంకటేష తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంజామల: వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని వాడవాడల్లో బొజ్జ గణపయ్యలను కొలువుదీర్చారు. గురువారం సంజామల వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా కొలువుదీర్చిన పార్వతీ తనయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని పలు కాలనీల్లో కొలువుదీరిన గణనాథులకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఎస్వీ పాలేస్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడు కళ్లు మూసి తెరుస్తుండడంతో అందరిని ఆకట్టుకుంది. విద్యానగర్ కాలనీలో కమిటీ సభ్యుడు ప్రజ్ఞా నరసింహారెడ్డి, పుట్లాలమ్మ దేవస్థానం ఈవో జయచంద్రరెడ్డి ఆధ్వర్యంలో 18 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సత్రం కాలనీలో కూడా అతి పెద్ద వినాయకుడిని ఏర్పాటు చేసి కాలనీ వాసులు ప్రతేక పూజలు చేశారు.

దొర్నిపాడు: ఆయా గ్రామాల్లో వినాయక చవితి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఆయా మండపాల్లో కొలువుదీరిన వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఘనంగా జరుపుకున్నారు. మండలంలో 65 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. రెండురోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మండపాల వద్ద ఆటపాటలతో సం దడి చేశారు. శుక్రవారం అన్ని గ్రామాల్లో స్థానిక కుందూనది వద్ద నిమజ్జనం చేయనున్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల రాఘ వేంద్రరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప ట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయ కులకు టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల దాతలు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా గణనాథులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



కొలిమిగుండ్ల: పూజల్లో పాల్గొన్న టీడీపీ కోకన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి



దొర్నిపాడు గ్రామంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



చాగలమర్రిలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

గ్రామాల్లో కుండపోత వర్షం

చాగలమర్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. దాంతో ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాల, పలు రహదారులు జలమయమయ్యాయి. పశువైద్యశాల, ఎస్‌బీఐ కాలనీ రహదారులు నీటి కుంటలుగా మారాయి.

రుద్రవరం: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. వరి, మొక్కజొన్న, మిరప, పసుపు, అరటి పొలాల్లో వర్షం నీరు నిలిచింది. దాంతో రైతులు కొంత ఆందోళన చెందారు.

సంపూర్ణ అక్షరాస్యత అందరి బాధ్యత

చాగలమర్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత అందరి బాధ్యతని వయోజన విద్య జిల్లా ఏపీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉల్లాస్ పథకం ద్వారా వీవోఏలు, మహిళా వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహులు, ఏపీఎం నాగమ్మ, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రుద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం స మీపంలో ప్రమాదకరంగా మారిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో 'కుంగిన కల్వర్టు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్థానిక నాయకులు అధికారులు స్పందించి కల్వర్టు వద్ద మట్టి వేయించి చదను చేయించారు. వాహనాల రాకపోకలకు కాస్త సౌకర్యంగా మారింది.

పేకాట స్థావరంపై దాడి

కొలిమిగుండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేట్నీకోట గ్రామ సమీపంలో అంకన్న బావి వంకలో పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం దాడులు నిర్వహించినట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని రూ.38వేలు నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దుతా: మంత్రి



చెత్త సేకరణ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, ఆగస్టు, 28 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లెను స్వచ్ఛ పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె గ్రామపంచాయతీ నిధులతో సమకూర్చిన చెత్తసేకరణ వాహనం, 28 డస్ట్ బిన్‌లను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి ప్రారంభించారు. చెత్తను కాల్వల్లో వేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి, డీఎల్‌పీవో రాంబాబు, సర్పంచ్ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఎంపీడీవో రమణ, ఈవోఆర్డీ బాలాంజనేయులు, ఈవో సతీశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- పట్టణంలోని అధ్వానంగా ఉన్న ఆటోనగర్ రోడ్డును మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. త్వరలో సీసీ రోడ్డు నిర్మిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.
- ప్రజా సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు.

టీడీపీతోనే మహిళా సంక్షేమం

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల దంపతులు

డోన్ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి సూపర్ సిక్స్. సూపర్ హిట్ కార్యక్రమంలో స్త్రీ శక్తి పథకంపై వేలాది మంది మహిళా నారీమణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈ ర్యాలీ సమైక్యాంధ్ర కట్ట వరకు చేరుకుంది. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మాట్లాడారు. సీఎం చంద్రబాబు మహిళల అభ్యున్నతి కోసం శ్రమించే నాయకుడు కొనియాడారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు రూ.270 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. మహిళలకు ఎన్నో పథకాలు అందిస్తున్న సీఎం చంద్రబాబు ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, విజయబట్టు, కమలాపురం సర్పంచ్ అర్జున్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రికే గాయత్రీదేవి, మాజీ జడ్పీటీసీ పద్మావతమ్మ, సరోజ, సీనియర్ నాయకులు పెద్దకేశవయ్యగౌడు, శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, చంద్రపల్లి లక్ష్మీనారాయణ యాదవ్, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు నందు వెంకటరమణ, ఓంప్రకాష్, తొప్పెల శ్రీనివాసులు, వెంకటనాయుణిపల్లె శ్రీనివాసులు యాదవ్, ఆలా మోహన్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలలు అభివృద్ధి

శిరివెళ్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించే సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ఎంఈవో-2 నాగార్జునరెడ్డి అన్నారు. ఇసుకపల్లె జడ్పీహెచ్ ఎస్‌లో దాతలు వెంకటరావు, రాఘవేంద్రారెడ్డి, చిన్న నరసింహుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంఈవో, దాతలు ప్రారంభించారు. పాఠశాలకు 20 కుర్చీలు, 20 టేబుళ్లను వితరణగా అందజేసినట్లు హెచ్ఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కథా పురస్కారాల్లో గ్రామీణ విద్యార్థుల ప్రతిభ

చాగలమర్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి కథా పురస్కారాల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. పదోతరగతి విద్యార్థి డి.యశ్వంత్ 'పరీక్ష', వై.పూజిత 'మానవత్వం', జి.అనూ(8వ తరగతి) 'తండ్రి కష్టం' అనే కథలకు జాతీయస్థాయి పురస్కారాలు అందుకున్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు మారంరెడ్డి నాగేశ్వరమ్మను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్లా, హెచ్ఎం కాత్యాయని, ఉపాధ్యాయులు అభినందించారు.

భవిత కేంద్రాలను వినియోగించుకోవాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవస రాలున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భవితా కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎంఐఎస్ అధికారి జగన్ మోహన్‌రెడ్డి, ప్రసన్నకుమార్ కోరారు. గురువారం కొలిమిగుండ్లలోని భవిత కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఎంఈవో రామకృష్ణ, సీఆర్పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. వివరాలు నమోదు చేశారు.

మహిళపై దాడి

శిరివెళ్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్లలోని బలిజపేటకు చెందిన కురువ మహాలక్ష్మి అనే మహిళలపై అదే గ్రామానికి చెందిన సురేంద్ర దాడి చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.